## సమాచారం

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా శనివారం మేడ్చల్ పట్టణం కంట్రీక్లబ్ 11కేవీ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలు, స్టేషన్ రోడ్డు, కంట్రీ క్లబ్ ఏరియా, సరస్వతి నగర్, వీకర్ సెక్షన్, సాయిబాబా నగర్, ఎయిర్‌ఫోర్స్‌కాలనీ, ఏకలవ్య నగర్, వెంకట్రామయ్య కాలనీ, హరిజన వాడల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

### మేడ్చల్ ఏసీపీగా వెంకట్‌రెడ్డి



నూతన ఏసీపీ వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఏసీపీగా సామల వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ శాఖ ఇటీవల నూతన జోన్లు, డివిజన్లను ఏర్పాటు చేసింది. బాలానగర్ డీసీపీ పరిధి నుంచి కొత్తగా మేడ్చల్ డీసీపీ జోన్ ఏర్పాటు కాగా జోన్ పరిధిలో ఉన్న పేట్‌బషీరాబాద్ ఏసీపీ డివిజన్‌ను రెండు డివిజన్లుగా మార్చారు. దీంతో మేడ్చల్ డివిజన్ కొత్తగా ఏర్పాటు కాగా మేడ్చల్ పట్టణంలో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మేడ్చల్ ఏసీపీగా నియమితులైన సామల వెంకట్‌రెడ్డి శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు రఘురాం, మురళీధర్, సత్యనారాయణ, శంకర్ గౌడ్, సిబ్బంది ఏసీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

## క్లుప్తంగా...

### వాహనాల పార్కింగ్ టెండర్‌పై అవగాహన

కీసర: కీసరగుట్టలో వాహనాల పార్కింగ్ వసూలు చేసేందుకు గుత్తేదారుడి కోసం నిర్వహించనున్న ఆన్‌లైన్ టెండర్‌పై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు ఆన్‌లైన్ టెండర్ వేసే విధానంను తెలుసుకునేందుకు అవగాహన సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆమె సూచించారు.

### గోధుమకుంటలో గ్రామ సభ

కీసర: అందరి సహకారంతో గోధుమకుంటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక నిమిత్తం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపీటీసీలు మంచాల కిరణ్, జ్యోతిప్రవీన్, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### కీసర బ్రహ్మోత్సవాల నిర్వహణలో అందరినీ భాగస్వామ్యం చేయండి

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని భోగారం గ్రామ ఎంపీటీసీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కీసరలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సమీక్ష సమావేశాల్లో అధికారులు, దేవస్థానం పాలకవర్గం సభ్యులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులను కూడా ఆహ్వానించి జాతర విజయవంతం అయ్యేందుకు భాగస్వాములను చేసేవారని, కానీ మంత్రి మల్లారెడ్డి మాత్రం వీరందరిని పక్కనబెట్టి కేవలం అధికారులతో నిర్వహించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఏళ్ల నుంచి వస్తున్న కీసరగుట్ట జాతర ప్రతిష్టను దెబ్బతీసేలా మంత్రి మల్లారెడ్డి చర్యలున్నాయని, ఇప్పటికైనా ఆయన జాతర విషయంలో అందరిని కలుపుకుని పోవాలని కోరారు.

### ఏసీపీకి సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న విజయారావు

మేడ్చల్: బదిలీపై పేట్‌బషీరాబాద్ ఏసీపీగా వచ్చిన ఏసీపీ వెంకట్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌కేవీ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో సన్మానించి తమ సమస్యలను విన్నవించారు. ఏసీపీ మేడ్చల్ రావడంతో ఆయన్ను కలిసిన బీఆర్‌ఎస్‌కేవీ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు స్వాగతం పలికి మేడ్చల్ పరిధిలో ఆటో డ్రైవర్ల సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ యూనియన్ అధ్యక్షుడు విజయరావు, సీఐ రాజశేఖర్‌రెడ్డిలు ఉన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అమయ్ కుమార్

# సమస్యలు బోలెడు.. అమయ్ సార్‌పైనే ఆశలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా అమయ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ
- రెండేళ్లకు పైగా కొనసాగిన ఇన్‌చార్జి పాలన తర్వాత కలెక్టర్ నియామకం
- మసకబారిన పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాలని కోరుతున్న జిల్లా ప్రజలు
- ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని విన్నపాలు

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.అమయ్ కుమార్ ముందు సమస్య సవాల్ విసురుతూ స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాను ముందుకు నడిపించాల్సిన బృహత్తర బాధ్యత ప్రస్తుతం అమయ్ కుమార్‌పై పడింది. ఇక్కడ దాదాపు రెండేళ్లకు పైగా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా పని చేసిన డాక్టర్ ఎస్.హరీష్ పక్కనున్న రంగారెడ్డి జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెల్సిందే. ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అమోయ్‌కుమార్ దృష్టి సారించాల్సిన సమస్యలెన్నో ఉన్నాయి.**

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం నుంచి కలెక్టర్‌గా ఎక్కువ కాలం పని చేసింది డాక్టర్ ఎంవీ రెడ్డి ఒక్కరే. తర్వాత జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వాసం వెంకటేశ్వర్లు ఏడాది పూర్తి కాక ముందే బదిలీ అయ్యారు. అప్పటి నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ల పాలనలో కొనసాగుతూ వచ్చింది. ఏడు మాసాలు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన శ్వేతామహంతి జిల్లాకు ఏడు మాసాలు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత దాదాపు రెండేళ్ల పాటు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో మెదక్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.హరీష్ పని చేశారు. దాదాపు మూడేళ్ల పాటు ఇన్‌చార్జుల పాలనలో కొనసాగిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పాలనా రంగంలో మసక బారిందని ఆరోపణలు లేకపోలేదు.

**ప్రజా ఫిర్యాదుల విభాగమే ప్రామాణికం..**

కలెక్టర్ నేతృత్వంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగమే(ప్రజావాణి) అధికారుల పని తీరుకు ప్రామాణికం. ఫిర్యాదుల విభాగం ప్రారంభం కాగానే అరగంట పాత(పెండింగ్) దరఖాస్తులపై సమీక్ష ఉండేది. పాత వాటిలో పరిష్కారమైనవి ఎన్ని? కాని వాటి కారణాలేంటనే దానిపై చర్చ జరిగేది. కొంత కాలంగా ఆ విధానం ఆగిపోయింది. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ కార్యాలయాల్లో న్యాయం జరగక ప్రజావాణికి వచ్చే బాధితులను కలెక్టర్ అందుబాటులో లేకపోతే పట్టించుకోవడం అనేది షరా మామూలుగా ఉండేది. అలాగే ప్రజల గోడు వినేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి'లో ఇన్‌చార్జి కలెక్టర్లు హాజరైంది చాలా తక్కువే. దీంతో ప్రజావాణి వినతులకు మోక్షం లభించకపోగా.. వాటి పరిష్కారం ఏ స్థితిలో ఉందన్న విషయం కూడా ఫిర్యాదుదారులకు తెలియక కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టర్ ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలను జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు శాతం, సమయం పాలన ఇష్టారీతిన ఉండేదన్న విమర్శలు లేక పోలేదు. ఇక్కడ ఎక్కువ కాలం కలెక్టర్‌గా పని చేసిన ఎంవీ రెడ్డి మాత్రమే పేదలు, రైతుల గోడు వినడం, క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూడటమే కాకుండా శాఖల వారీగా సమీక్షలు నిర్వహించడంతో ఆయన ప్రజల నుంచి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.





కలెక్టరేట్‌లో రికార్డులను పరిశీలిస్తూ... కలియ తిరుగుతున్న కలెక్టర్ అమయ్ కుమార్

**జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలు...**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, 11,384 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. ఈ అసైన్డ్ భూములను 2004 నాటికి 116 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 8,230 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం అసైన్డ్ చేసింది. అసైన్డ్ భూముల్లో దాదాపు 40 శాతం అన్యాక్రాంతం కాగా, ఇందులో వివిధ రకాల కట్టడాలు వెలిశాయి. అలాగే జిల్లాలో రూ.26 వేల కోట్ల విలువ చేసే 7,458 ఎకరాల భూములపై వివిధ కోర్టుల్లో 706 కేసులు నడుస్తున్నాయి.

**సవాల్‌గా భూ ఆక్రమణలు..**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కీసర, మేడిపల్లి, అల్వాల్, కాప్రా, దుండిగల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కూకట్‌పల్లి, శామీర్‌పేట, ఎంసీపల్లి, బాలానగర్, ఘట్‌కేసర్ మండలాలు ఉన్నాయి. వీటిలో భూకబ్జాలు, ఆక్రమణలు జోరుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా జిల్లాలో 13 పురపాలక సంఘాల పరిధిలో 1368 అక్రమ నిర్మాణాలు, 4 లేఅవుట్లు ఉండగా, 61 పంచాయతీల్లో 2100 అక్రమ నిర్మాణాలు, 34 లేఅవుట్లు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతికి అడ్రస్‌గా మారింది. ఇంటి నంబర్లు మొదలుకొని ఇంటి అనుమతులకు అమ్యామ్యాలు ముట్టజెపాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత జిల్లా అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా సాగుతోంది. భూ కబ్జాల్లో పలువురి రాజకీయ నేతలు, బడా బాబుల పాత్ర ఉండటంతో వాటిని పరిరక్షించే బాధ్యతను రెవెన్యూ శాఖ చూసీచూడనట్లు వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణ బాధ్యత కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా మారనుందని తెలుస్తోంది.

**ధరణి చిక్కులు విప్పుతారా?**

జిల్లాలో ధరణి సంబంధించి 45 దరఖాస్తులు రాగా, ఇందులో 43 వేలు పరిష్కారమైనట్లు చెబుతున్నప్పటికీ ప్రతీ రోజు ధరణికి సంబంధించిన భూ సమస్యలపై పదుల సంఖ్యలో రైతులు, ఇతరులు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**అభివృద్ధి పనులు సైతం అంతంతే...**

జిల్లాకు 2,420 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 630 మాత్రమే పూర్తయ్యాయి. 13 పట్టణాల్లో 16.82 ఎకరాల్లో రూ.39.90 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ల నిర్మాణం నత్తకు నడక నేర్పుతున్నాయి. 'మన ఊరు–మన బడి' కింద నిర్మిస్తున్న ప్రభుత్వ బడుల పరిస్థితి దీనికి తీసిపోని విధంగా ఉంది. 176 బడుల్లో ఇప్పటి వరకు 25 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా అభివృద్ధి పనులు కూడా నెమ్మదించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు చేర్చే విషయాలపై దృష్టి సారించాల్సి ఉంది.

**టీచర్ల బదిలీలు..**

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ మొదలైంది. దీనికి ముందే కొంత మంది దొడ్డిదారిన వచ్చి పోస్టులు పొందారు. త్వరలోనే ఆన్లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. క్లిష్టమైన ఈ పక్రియను కొత్త కలెక్టర్ ఎంత సమర్థవంతంగా నిర్వహించనున్నారో చూడాల్సి ఉంది. ప్రభుత్వం వీఆర్‌ఎలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. పేస్కేల్, సర్వీస్ రూల్స్ వంటి అంశాలపై ఇప్పటికీ ఓ స్పష్టత లేకపోవడం వంటి అంశాలు కొత్త కలెక్టర్‌కు సవాల్‌గా మారే అవకాశం ఉంది.

## డంప్‌యార్డు సమస్యను పరిష్కరించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నేత కొంపల్లి మోహన్‌రెడ్డి

కీసర: అసమర్థులు, అవినీతిపరుల చేతిలో ఉన్న ప్రభుత్వం ఏనాటికీ ప్రజల గోసను తీర్చలేదని బీజేపీ రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ, జేఏసీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ డంప్ యార్డు తరలించేందుకు మున్సిపాలిటీ ప్రజలంతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తమ గోడును చెప్పుకునేందుకు పెద్ద పోస్టుకార్డుల ద్వారా వినతులను పంపించే కార్యక్రమాన్ని ఆయన మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జవహర్ నగర్ చెత్త డంప్ యార్డు సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అందుకే ప్రజలే తమ నిరసనలు, పోరాటాల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించే వరకు నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంపత్, శాంతి, వేణుగోపాల్, నాగమల్లారెడ్డి, బొమ్మిడి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొర్రెముల్‌లో అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కొర్రెముల్‌లో అక్రమాల పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పాలకవర్గ సభ్యులు

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలతో నిర్మిస్తున్న కట్టడాలపై విచారణ జరపాలని ఆ గ్రామ పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు అదనపు కలెక్టర్ ద్వారా శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరుగుతున్న అక్రమ కట్టడాలతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతుందని తాము కార్యదర్శిని కోరితే గ్రామంలో అక్రమ కట్టడాలు లేవని, ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోండని కార్యదర్శి బెదిరించిందన్నారు. కార్యదర్శి ఒంటెద్దు పోకడలతో పాటు మహిళ వార్డు సభ్యులకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పంచాయతీ గౌరవాన్ని అబాసు పాలు చేస్తోందని విన్నవించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బాబు, స్వామి, ఈశ్వరీ, లక్ష్మీ, భార్గవి ఉన్నారు.

## బాధితులు న్యాయం కోసం ధైర్యంగా పీఎస్‌కు వచ్చేలా చూడండి

ఘట్‌కేసర్: బాధితులు నాయ్యం కోసం ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే పరిస్థితులు కల్పించాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా మెలగాలని, సాధ్యమైనంత వరకు సత్వరం న్యాయం అందేలా చూడాలన్నారు. ఓఆర్‌ఆర్‌కు లోపల, బయట గ్రామాలకు దూరంగా కాలనీలకు పోలీసులు స్వయంగా వెళ్లి డయల్ 100పై అవగాహన కల్పించాలని, శాంతి భద్రతలపై సహకారం ఇవ్వాలని కోరాలన్నారు. కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, డీఐ జంగయ్య, ఎస్సైలు నాగార్జున్‌రెడ్డి, విజయకృష్ణ, ధనంజయ, జ్ఞానేందర్ రెడ్డి, శివకృష్ణ, రామునాయక్, అశోక్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పీఎస్‌లో పనితీరు తెలుసుకుంటున్న సీపీ డీఎస్ చౌహాన్

### ఘనంగా ప్రభాకర్‌గౌడ్ పుట్టిన రోజు

శామీర్‌పేట్: టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటలోని వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా జరిగాయి. మేడ్చల్ నియోజకవర్గం వ్యాప్తంగా ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు హాజరై ఆయన్ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మూడుచింతలపల్లి మండలాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, పలువురు సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



## ఉత్సవాలకు రావాలంటూ మంత్రికి ఆహ్వానం

మేడ్చల్: అత్వెల్లి పరిధిలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న శివాలయ ప్రారంభ ఉత్సవాలకు హాజరవ్వాలని కోరుతూ మంత్రి మల్లారెడ్డిని అత్వెల్లి కౌన్సిలర్లు ఆహ్వాన పత్రికను అందజేశారు. పురాతన ఆలయంను నూతనంగా నిర్మించి ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డితో బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డిని, జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డిలను ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, సరితా మల్లేష్‌గౌడ్, శివస్వాములు, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మంత్రిని ఆహ్వానిస్తున్న కౌన్సిలర్లు

## జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధే లక్ష్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ శాంతినగర్, ఆనంద్‌నగర్ కాలనీలో శుక్రవారం మేయర్ మేకల కావ్య విస్తృతంగా పర్యటించారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, సీసీ రోడ్డు తదితర సమస్యలను కాలనీవాసులు మేయర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ... జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జవహర్‌నగర్‌లో ఇప్పటికే అభివృద్ధి శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో 15 డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం, బీఆర్‌ఎస్ యువజన నాయకులు భార్గవ్‌రామ్, మహిళ నాయకురాలు స్వప్న, నాయకులు మతీన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న మేయర్ కావ్య

### పంచాయతీ భవనానికి భూమి పూజ



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం మురహరిపల్లిలో నూతన పంచాయతీ భవనం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.20లక్షల ఎంజీఎన్ఆర్ ఈ జీఎస్ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నామని సర్పంచ్ ధార భాస్కర్ తెలిపారు. భవన నిర్మాణానికి వంద గంజాల స్థలాన్ని విరాళం ఇచ్చిన తిలకం ప్రవీణ్‌కు తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, వార్డుసభ్యులు ఉన్నారు.

### ఎమ్మార్‌ఐఈటీలో సదస్సు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐఈటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఆంగ్ల భాష సాహిత్యం, కమ్యూనికేషన్స్, నైపుణ్యతపై నిర్వహించిన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, నరసింహరావు ప్రారంభించారు. అనంతరం సదస్సు పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల వద్ద పటిష్ట బందోబస్తు: రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

కీసర: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, కీసర సీఐ రఘువీర్‌రెడ్డిలతో కలిసి కీసరగుట్ట జాతర జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ డి.జానకీ, కీసర సీఐ రఘువీర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జవహర్‌నగర్: కౌకూర్ దర్గా సమీపంలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. శుక్రవారం కౌకూర్ దర్గా సమీపంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల వరకు ఉంటుంది. నీలం, పసుపు, ఎరుపు, నలుపు టీషర్టు ధరించి ఎడమ చేతిపై కల్పన, కుడి చేతిపై పద్మ, ఛాతీ కుడిభాగంలో కావేరి అనే పేర్లతో పచ్చబొట్టు ఉందని, సమాచారం తెలిసిన వారు సెల్: 9490617140, 9491060904 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

### మహిళ అదృశ్యం



ప్రియ

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సిలమ్ ప్రియ (25) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గత కొంత కాలంగా మానసికస్థితి బాగాలేదని కుటుంబ సభ్యులు తెలపగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### వ్యక్తి మృతి



చంద్రయ్య మృతదేహం

జవహర్‌నగర్: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం... అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటూ కూలీ పనులు చేసే ఎం.చంద్రయ్య (45) గురువారం సాయంత్రం అతిగా మద్యం సేవించి రోజ్ గార్డెన్ సమీపంలో మృతి చెంది పడి ఉన్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వారు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## నిరుపేదల కోసం పోరాడిన మహనీయుడు కారింగుల నర్సింగరావు

జవహర్‌నగర్: ప్రతీ నిరుపేదకు నీడ ఉండాలని పోరాడిన మహనీయుడు కారింగుల నర్సింగరావు అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల నర్సింగరావు 24వ వర్ధంతిని బాలాజీనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌తో పాటు మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లు, కుల సంఘాల నాయకులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, టీఆర్‌ఎస్ నాయకుడు కారింగుల రాజుగౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులతో పాలు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



నర్సింగరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అలర్పిస్తున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్